# క్రైం కౌంటర్

ప్రజా సంక్షేమమే అంతిమ లక్ష్యం

తెలుగు దినపత్రిక

సంపుటి : 02 సంచిక : 81 శుక్రవారం 19-12-2025 పేజీలు : 4 వెల : 4/-

Website:- https://www.crimecounter.in/



క్రైం కౌంటర్ News


ప్రజా సంక్షేమమే అంతిమ లక్ష్యం

తెలంగాణ సూర్యాపేట్ జిల్లా తెలుగు దినపత్రికలో పనిచేయుటకు

రిపోర్టర్లు కావలెను

- జిల్లా బ్యూరోలు
- నియోజక వర్గ ఇన్చార్జీలు

Contact No: 98497 07349


అమెరికా కొత్త సోషల్ మీడియా వెట్టింగ్ పాలసీతో హెచ్ 1బీ వీసాదారులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ కొత్త నిబంధన కారణంగా వీసా ఇంటర్వ్యూలు భారీగా ఆలస్యం అవుతున్నాయి. దీంతో ప్రస్తుతం భారత్‌లో ఉన్న వారికి చాలా మందికి వీసా అపాయింట్‌మెంట్‌లు వచ్చే ఏడాది అక్టోబర్ వరకు వాయిదా పడ్డాయి. ఈ నేపథ్యంలోనే భారత్‌లో చిక్కుకుపోయిన వారు తమ ఉద్యోగం పోకుండా చూసుకోవాలని.. అమెరికా ఇమ్మిగ్రేషన్ అధికారులు సూచిస్తున్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నేతృత్వంలోని ప్రభుత్వం ఈనెల 15వ తేదీ నుంచి కొత్తగా సోషల్ మీడియా వెట్టింగ్ విధానాన్ని అమలులోకి తీసుకువచ్చింది. దీని వల్ల భారతీయ హెచ్-1బీ వీసాదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ కొత్త నిబంధనల కారణంగా వీసా ఇంటర్వ్యూలు చాలా ఆలస్యం కావడంతో.. ఇప్పుడు మన దేశంలో ఉన్న చాలా మందికి అక్టోబర్ 2026 వరకు అపాయింట్‌మెంట్లు రీషెడ్యూల్ అయ్యాయి. ఈ నేపథ్యంలోనే.. భారతీయులకు అమెరికా ఇమ్మిగ్రేషన్ అధికారులు కీలక హెచ్చరికలు జారీ చేస్తున్నారు. ముఖ్యంగా భారత్‌లో చిక్కుకున్న వారు తమ ఉద్యోగాన్ని కోల్పోకుండా చూసుకోవాలని పేర్కొంటున్నారు. ఎందుకంటే కొత్త నిబంధనల ప్రకారం అమెరికా బయట ఉన్న వ్యక్తికి.. కొత్త వీసా రావడం దాదాపు అసాధ్యమని చెబుతున్నారు. హెచ్-1బీ వీసా దారులకు ప్రముఖ ఇమ్మిగ్రేషన్ అటార్నీ ఎమిలీ న్యూమాన్ ఒక కీలక సలహా ఇచ్చారు. ప్రస్తుతం భారత్‌లో ఉండి, వీసా అపాయింట్‌మెంట్లు కనీసం 6 నెలలు లేదా అంతకంటే ఎక్కువ కాలం వాయిదా పడిన వారు.. వారికి ఉన్న ఉద్యోగాన్ని కాపాడుకోవాలని సూచించారు. ఎందుకంటే ట్రంప్ తెచ్చిన కొత్త రూల్స్ ప్రకారం.. అమెరికా బయట ఉన్న వ్యక్తి కోసం ఒక కంపెనీ కొత్త హెచ్-1బీ జారీ చేయాలంటే లక్ష డాలర్లు అంటే సుమారు రూ.90 లక్షల ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. ఇంత భారీ మొత్తాన్ని వెచ్చించి కొత్తగా ఎవరినీ నియమించుకోవడానికి అమెరికాలోని కంపెనీలు సిద్ధంగా లేవు. దీంతో హెచ్ 1బీ వీసా అపాయింట్‌మెంట్ ఆలస్యం అయి.. ఇప్పుడు చేస్తున్న ఉద్యోగం పోతే.. వేరే కంపెనీలో చేరి తిరిగి అమెరికా వెళ్లడం దాదాపు అసాధ్యం అవుతుందని నిపుణులు చెబుతున్నారు. అందుకే.. కంపెనీ నుంచి.. వర్క్ ఫ్రమ్ హోమ్ లేదా లాంగ్ లీవ్ తీసుకోవడం మంచిదని పేర్కొంటున్నారు. ఎమర్జెన్సీ అపాయింట్‌మెంట్ దొరికే అవకాశాలు చాలా తక్కువగా ఉన్నాయని ఎమిలీ న్యూమన్ తెలిపారు. సోషల్ మీడియా స్క్రీనింగ్ అనేది అభ్యర్థులను తగ్గించడానికి ఒక సాకుగా మారుతోందని మరో ఇమ్మిగ్రేషన్ లాయర్ రాహుల్ రెడ్డి అభిప్రాయం వ్యక్తం చేశారు. అమెరికా సరిహద్దుల వద్ద ట్రంప్ ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తోందని.. వీసా ఉన్నప్పటికీ దేశం వెలుపల ఉన్న వారిని లోపలికి రాకుండా అడ్డుకునే అవకాశం ఉందని ఆయన హెచ్చరించారు. ప్రస్తుతం అమెరికాలో ఉన్న హెచ్-1బీ వీసాదారులు ఎవరూ ఇప్పుడు భారత్ సహా ఇతర దేశాలకు ప్రయాణాలు పెట్టుకోవద్దని ఆయన సూచించారు. డిసెంబర్ 15వ తేదీ నుంచి అమలులోకి వచ్చిన ఈ కొత్త నిబంధనల ప్రకారం.. హెచ్-1బీ, హెచ్-4 వీసా దరఖాస్తుదారులు తమ గత 5 ఏళ్ల సోషల్ మీడియా ఖాతాల వివరాలను (ఫేస్‌బుక్, ఎక్స్, ఇన్‌స్టాగ్రామ్, లింక్డ్ ఇన్) సమర్పించాలి. అంతేకాకుండా తమ సోషల్ మీడియా ప్రొఫైల్స్ అన్నింటినీ ప్రైవేట్ నుంచి.. పబ్లిక్ మోడ్‌లోకి మార్చుకోవాలి. దీంతో ఆ సోషల్ మీడియా అకౌంట్లను క్షుణ్ణంగా పరిశీలించడానికి అమెరికా కాన్సులేట్ అధికారులకు అదనపు సమయం పడుతుండటంతో.. వీసా ఇంటర్వ్యూలను 2026 వరకు వాయిదా వేస్తున్నారు.

## మూడు విడతల గ్రామపంచాయతీ ఎన్నికలు ప్రశాంతంగా పూర్తి

పటిష్ట భద్రత, సిబ్బంది సమన్వయంతో సజావుగా ఎన్నికల నిర్వహణ...క్రైమ్ కౌంటర్ న్యూస్ ప్రతినిధి మహబూబ్ నగర్ జిల్లా: - స్థానిక సంస్థల ఎన్నికలలో భాగంగా మహబూబ్‌నగర్ జిల్లాలో మూడు విడతలుగా నిర్వహించిన గ్రామపంచాయతీ సర్పంచ్ ఎన్నికలు ఎలాంటి చిన్న అవాంఛనీయ సంఘటనలు లేకుండా పూర్తిగా ప్రశాంతంగా, సజావుగా నిర్వహించబడినట్లు జిల్లా ఎస్పీ డి.జానకి తెలిపారు. ఎన్నికల విధుల నిర్వహణకు మొత్తం 1249 మంది పోలీస్ అధికారులు, సిబ్బందిని నియమించి సమర్థవంతమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిపారు. ఎన్నికల విధుల్లో పాల్గొన్న ప్రతి అధికారి, సిబ్బంది కర్తవ్యనిష్ఠతో విధులు నిర్వర్తించినందుకు జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా ప్రశంసలు కురిపించారు. అలాగే పోలీస్ శాఖకు పూర్తి సహకారం అందించి ఎన్నికలు శాంతియుతంగా జరిగేలా తోడ్పడిన జిల్లావాసులకు కృతజ్ఞతలు తెలిపారు.ఎన్నికల కోడ్ అమలులో కఠిన చర్యలు నగదు, మద్యం స్వాధీనంఎన్నికల కోడ్ అమలులో భాగంగా చేపట్టిన తనిఖీలు, నిఘా చర్యలలో రూ.11,08,250/- నగదును సీజ్ చేయడం జరిగిందని తెలిపారు. అదేవిధంగా రూ.6,93,858/- విలువగల మద్యం కేసులకు సంబంధించి 81 ఎక్సైజ్ కేసులు నమోదు చేసి 1050.23 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. అలాగే రూ.7,200/- విలువగల ఉచితాల పంపిణీకి సంబంధించిన 1 కేసు, 3 ఎన్నికల నిబంధనల ఉల్లంఘన కేసులు, 4 మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ఎం సి సి ఉల్లంఘన కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. భద్రతా చర్యల్లో భాగంగా 70 నాఖాబందీ ఆపరేషన్లు, 37 ఆయుధాల డిపాజిట్, 640 మందిని బైండ్ ఓవర్ చేయడం జరిగిందని, జిల్లావ్యాప్తంగా 3 చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి కట్టుదిట్టమైన పర్యవేక్షణ కొనసాగించినట్లు జిల్లా ఎస్పీ డి.జానకి తెలిపారు.




## డిసెంబర్ 21న జాతీయ మెగా లోక్-అదాలత్




డిసెంబర్ 21న జాతీయ మెగా లోక్-అదాలత్ ఉ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి..సైబర్ నేరాలు, చిన్న మొత్తాల రీఫండ్‌కు లోక్-అదాలత్ ద్వారా సత్వర పరిష్కారం...రాజీ మార్గమే రాజ మార్గం ఉ జిల్లా ఎస్పీ డి.జానకి, ఐపిఎస్..క్రైమ్ కౌంటర్ న్యూస్ ప్రతినిధి మహబూబ్ నగర్ జిల్లా: - డిసెంబర్ 21న జరగనున్న జాతీయ మెగా లోక్-అదాలత్ ను ప్రజలు పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలని మహబూబ్‌నగర్ జిల్లా ఎస్పీ డి.జానకి, ఐపిఎస్ ఒక ప్రకటనలో తెలిపారు. క్షణికావేశంలో జరిగిన తప్పులను సరిదిద్దుకోవడానికి లోక్-అదాలత్ ఒక ఉత్తమ అవకాశమని, రాజీకి అవకాశం ఉన్న అన్ని కేసుల్లో కక్షిదారులు పరస్పర సమ్మతితో రాజీ పడవచ్చని పేర్కొన్నారు. అనవసర గొడవల వల్ల జీవితాలు ఇబ్బందుల పాలవకుండా, రాజీ ద్వారా ఇరు వర్గాలు గెలిచినట్టే అవుతాయని అన్నారు.రాజీకి అర్హమైన కేసుల్లో ప్రత్యేక దృష్టి ఉ అధికారులకు సూచనలుఈ నెల 21 (ఆదివారం) జరగనున్న జాతీయ మెగా లోక్-అదాలత్ లో భాగంగా, జిల్లా వ్యాప్తంగా దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న క్రిమినల్ కంపౌండబుల్ కేసులు, సివిల్ తగాదాలు, ఆస్తి విభజన, కుటుంబ మరియు వైవాహిక వివాదాలు, బ్యాంకు రికవరీ, విద్యుత్ చౌర్యం, చెక్ బౌన్స్ వంటి రాజీకి అర్హమైన అన్ని కేసుల్లో ఇరు వర్గాల సమ్మతితో రాజీ కుదిరేలా చర్యలు తీసుకోవాలని ఎస్‌హెచ్‌ఓలు మరియు కోర్ట్ డ్యూటీ అధికారులను ఎస్పీ ఆదేశించారు.అదేవిధంగా సైబర్ నేరాల విషయంలో, మోసగాళ్ల చేతిలో బాధితులు కోల్పోయిన డబ్బులు వీలైనంత త్వరగా బాధితులకు అందేలా చూడాలని, రూ.25,000 కంటే తక్కువ మొత్తం కోల్పోయిన కేసుల్లో లోక్-అదాలత్ ద్వారా ఫిర్యాదు స్వీకరించి, ఎఫ్ఐఆర్ లేకుండానే రీఫండ్ ప్రక్రియ చేపట్టాలని సూచించారు.జాతీయ మెగా లోక్-అదాలత్ విజయవంతం కావాలంటే అధికారులు నుంచి కానిస్టేబుల్ వరకు ప్రతి ఒక్కరు బాధ్యతాయుతంగా వ్యవహరించి, రాజీ పడదగిన అన్ని కేసుల్లో ఇరు వర్గాలకు కౌన్సిలింగ్ నిర్వహించి, సాధ్యమైనంత ఎక్కువ కేసులు రాజీ పడేలా కృషి చేయాలని జిల్లా ఎస్పీ డి.జానకి తెలిపారు.

## ఆ గ్రామంలో 69 ఏళ్ల తర్వాత మొదటిసారి ఎన్నికలు..




ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలం బరంపూర్ గ్రామంలో 69 ఏళ్ల ఏకగ్రీవ సంప్రదాయానికి తెరపడింది. పంచాయతీ ఏర్పడిన నాటి నుండి ఇక్కడ ఎప్పుడూ ఎన్నికలు జరగలేదు.. కానీ ఈసారి ఇద్దరు అభ్యర్థులు బరిలో నిలవడంతో తొలిసారిగా పోలింగ్ నిర్వహించారు. పండగ వాతావరణంలో జరిగిన ఈ చారిత్రాత్మక ఎన్నికలో ఓటర్లు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ హోరాహోరీ పోరులో బీఆర్ఎస్ మద్దతుదారుడు దేవ్‌రావుకు 1028 ఓట్లు రాగా.. కాంగ్రెస్ బలపరిచిన సిడాం లక్ష్మణ్‌కు 728 ఓట్లు వచ్చాయి. దీనితో 300 ఓట్ల మెజారిటీతో దేవ్‌రావు సర్పంచిగా విజయం సాధించారు. తెలంగాణలోని ఆదిలాబాద్ జిల్లా.. తలమడుగు మండలం పరిధిలో ఉన్న బరంపూర్ గ్రామ పంచాయతీ ఈసారి సరికొత్త రాజకీయ చరిత్రకు నాంది పలికింది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత, రాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా ఎప్పుడూ లేని విధంగా ఇక్కడ మొదటిసారిగా ఓటర్లు బ్యాలెట్ బాక్సుల వద్దకు తరలివచ్చారు. గత 69 ఏళ్లుగా ఈ గ్రామంలో సర్పంచి ఎన్నిక ఎప్పుడూ ఏకగ్రీవంగానే జరిగేది. కానీ.. మారుతున్న రాజకీయ సమీకరణలు, పార్టీల మధ్య పెరిగిన పోటీ ఈ సంప్రదాయాన్ని పక్కనపెట్టి ఎన్నికల రణక్షేత్రానికి దారితీసింది.బరంపూర్ పంచాయతీ ఏర్పడినప్పటి నుండి గ్రామంలో పెద్దల సమక్షంలో సయోధ్య కుదుర్చుకుని ఒకరినే సర్పంచిగా ఎన్నుకోవడం ఆనవాయితీగా వచ్చేది. అయితే.. ఈసారి రాజకీయ చైతన్యం పెరగడం, గ్రామ అభివృద్ధి విషయంలో విభిన్న అభిప్రాయాలు వ్యక్తమవడంతో ఇద్దరు అభ్యర్థులు పంతానికి పోయారు. అధికార కాంగ్రెస్ పార్టీ మద్దతుతో సిడాం లక్ష్మణ్ బరిలోకి దిగారు. ప్రధాన ప్రతిపక్షం భారత రాష్ట్ర సమితి (బిఆర్ఎస్) మద్దతుదారుడిగా దేవ్‌రావు అదృష్టాన్ని పరీక్షించుకున్నారు. గ్రామ పెద్దలు ఏకగ్రీవం కోసం ప్రయత్నించినప్పటికీ, రాజకీయ ఆధిపత్య పోరు కారణంగా అది సాధ్యపడలేదు. దీంతో 69 ఏళ్ల తర్వాత గ్రామంలో తొలిసారిగా పోలింగ్ నిర్వహించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ చారిత్రాత్మక ఎన్నికల కోసం గ్రామస్తులు పోలింగ్ కేంద్రాన్ని మధుర జ్ఞాపకంగా మార్చుకున్నారు. ఓటు వేయడం తమ ఊరికి కొత్త కావడంతో, పోలింగ్ కేంద్రాలను రంగురంగుల పూలతో, మామిడి తోరణాలతో అందంగా అలంకరించారు. గ్రామమంతా పండగ వాతావరణం నెలకొంది. ముసలి, ముతక అనే తేడా లేకుండా ప్రజలు ఉత్సాహంగా ఓటు హక్కు వినియోగించుకున్నారు.ఈ ఎన్నిక ఫలితం అటు కాంగ్రెస్, ఇటు బిఆర్ఎస్ పార్టీలకు ప్రతిష్ఠాత్మకంగా మారింది. ఎన్నికల అనంతరం వెలువడిన ఫలితాల్లో బిఆర్ఎస్ మద్దతుదారుడు దేవ్‌రావుకు 1028 ఓట్లు రాగా.. కాంగ్రెస్ బలపరిచిన సిడాం లక్ష్మణ్‌కు 728 ఓట్లు దక్కాయి. ఏకంగా 300 ఓట్ల భారీ మెజారిటీతో దేవ్‌రావు విజయం సాధించడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పటికీ, ఆదిలాబాద్ వంటి ఏజెన్సీ ప్రాంతాల్లోని మారుమూల గ్రామంలో బిఆర్ఎస్ మద్దతుదారు గెలవడం ఆ పార్టీ కేడర్‌లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. ప్రభుత్వ వ్యతిరేకత కంటే స్థానిక నాయకత్వ బలం, గత పదేళ్లలో జరిగిన అభివృద్ధిపై ప్రజలు మొగ్గు చూపినట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. దాదాపు 7 దశాబ్దాల తర్వాత ఇక్కడ ఎన్నికలు నిర్వహించడంతో.. ఓటు వేసిన వారి కోసం ప్రత్యేకంగా ఒక సెల్ఫీ పాయింట్ ఏర్పాటు చేశారు. దీనిలో ఓటు వినియోగించుకున్న ఓటర్లు సెల్ఫీలు దిగారు. అక్కడ మొత్తం ఒక పండుగ వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడం గొప్ప విషయం. ఇదిలా ఉండగా..

## పేదలకు ఫ్రీగా సూపర్ స్పెషాలిటీ వైద్యం..



తెలంగాణలో ప్రభుత్వ వైద్య సేవలను బలోపేతం చేస్తూ, తొమ్మిది జిల్లాల్లో ఆధునిక క్రిటికల్ కేర్ బ్లాక్స్ నిర్మాణం పూర్తయింది. ఈ యూనిట్లు మరో 15 రోజుల్లో అందుబాటులోకి రానున్నాయి. జిల్లా స్థాయిలోనే సూపర్ స్పెషాలిటీ వైద్యం, అత్యాధునిక వసతులతో ఉచితంగా అందించడం ద్వారా సామాన్యులకు అండగా నిలవనుంది. తెలంగాణ వ్యాప్తంగా ప్రభుత్వ వైద్య సేవలను అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. వనపర్తి, కామారెడ్డి, జగిత్యాల, జనగాం, వికారాబాద్, గోదావరిఖని, ఆసిఫాబాద్, కొత్తగూడెం, ఆదిలాబాద్ వంటి తొమ్మిది జిల్లాల్లో ఆధునిక క్రిటికల్ కేర్ బ్లాక్స్ నిర్మాణం పూర్తయింది. సుమారు 50 పడకల సామర్థ్యంతో నిర్మించిన ఈ యూనిట్లను మరో 15 రోజుల్లో ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడానికి ఆరోగ్య శాఖ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. జిల్లా స్థాయిలోనే సూపర్ స్పెషాలిటీ వైద్యం అందించడమే ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యం. వైద్య పరిభాషలో 'గోల్డెన్ అవర్' (మొదటి గంట) అత్యంత కీలకం. రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు, గుండెపోటు, బ్రెయిన్ స్ట్రోక్, గర్భిణీలకు వచ్చే అత్యవసర సమస్యల సమయంలో తక్షణమే చికిత్స అందితే ప్రాణాలు కాపాడే అవకాశం ఎక్కువగా ఉంటుంది. ఇప్పటివరకు ఇలాంటి కేసులను హైదరాబాద్ లేదా సమీపంలోని కార్పొరేట్ ఆసుపత్రులకు తరలించేలోపే ప్రాణాపాయం సంభవించేది. ఇప్పుడు ఈ కొత్త క్రిటికల్ కేర్ యూనిట్ల ద్వారా.. ఆ విలువైన సమయం వృధా కాకుండా జిల్లా కేంద్రాల్లోనే నిపుణులైన వైద్యులు, అత్యాధునిక పరికరాలతో చికిత్స అందించనున్నారు.ప్రతి క్రిటికల్ కేర్ బ్లాక్ కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా అత్యాధునిక వసతులతో రూపుదిద్దుకుంది. ఇందులో 10 ఐసీయూ పడకలు, 6 హెచ్‌డీయూ పడకలు, 24 ఐసోలేషన్ పడకలతో పాటు అంటువ్యాధులు సోకకుండా 'నెగిటివ్ ప్రెజర్ వెంటిలేషన్' వ్యవస్థను ఏర్పాటు చేశారు. అలాగే 2 మాడ్యులర్ ఆపరేషన్ థియేటర్లు, ప్రత్యేక డయాలిసిస్ పడకలు, స్వతంత్ర ఆక్సిజన్ ప్లాంట్లు, అత్యాధునిక ల్యాబ్ సదుపాయాలు ఇక్కడ అందుబాటులో ఉంటాయి. ఇన్ఫెక్షన్ నియంత్రణ కోసం రోగుల రాకపోకలకు ప్రత్యేక ప్రవేశ ద్వారాలను కూడా సిద్ధం చేశారు. సాధారణంగా క్రిటికల్ కేర్ చికిత్సలు ప్రైవేటు ఆసుపత్రుల్లో రోజుకు వేలల్లో, లక్షల్లో ఖర్చుతో కూడుకున్నవి. ఈ సేవలు ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా అందడం వల్ల పేద, మధ్యతరగతి ప్రజలపై భారీ ఆర్థిక భారం తగ్గనుంది. ఇది కేవలం మౌలిక సదుపాయాల కల్పనే కాకుండా.. ప్రజారోగ్య వ్యవస్థపై ప్రజలకు భరోసా కల్పించే దీర్ఘకాలిక పెట్టుబడి. జిల్లా స్థాయిలోని మెడికల్ కాలేజీల పరిధిలో ఇవి ఉండటం వల్ల వైద్య విద్యార్థులకు సైతం ప్రాక్టికల్ అనుభవం లభిస్తుంది. రాష్ట్రవ్యాప్తంగా విస్తరిస్తున్న ఈ క్రిటికల్ కేర్ వ్యవస్థ.. తెలంగాణను ఆరోగ్య రంగంలో దేశానికే ఆదర్శంగా నిలపనుంది. ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగికి రూపాయి ఖర్చు లేకుండా సొంత జిల్లాలోనే పునర్జన్మ ప్రసాదించే ఈ వ్యవస్థ సామాన్యుల పాలిట వరంగా మారనుంది.

## క్రిస్మస్, న్యూ ఇయర్ సెలబ్రేషన్స్ టార్గెట్..

క్రిస్మస్, నూతన సంవత్సర వేడుకల తరుణంలో సైబర్ నేరగాళ్లు సరికొత్త మోసాలకు తెరలేపుతున్నారు. పండుగ ఆఫర్లు, లక్కీ డ్రాలు, ఉచిత బహుమతుల పేరుతో వాట్సాప్, ఈమెయిళ్లకు ఆకర్షణీయమైన సందేశాలు పంపిస్తున్నారు. వీటిలోని అనుమానాస్పద లింకులను క్లిక్ చేస్తే నిమిషాల వ్యవధిలోనే బ్యాంక్ ఖాతాలు ఖాళీ అయ్యే ప్రమాదం ఉందని పోలీసులు హెచ్చరిస్తున్నారు. తక్కువ ధరకే విమాన, బస్సు టిక్కెట్లు ఇస్తామనే నకిలీ వెబ్‌సైట్ల పట్ల అప్రమత్తంగా ఉండాలి. గుర్తుతెలియని వ్యక్తులకు వ్యక్తిగత వివరాలు, ఓటిపిలు పంచుకోవద్దు. ఏదైనా అనుమానం వస్తే వెంటనే 1930 హెల్ప్‌లైన్ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని అధికారులు సూచిస్తున్నారు. క్రిస్మస్, నూతన సంవత్సర వేడుకల సంబరాల్లో ప్రజలు మునిగిపోయిన తరుణాన్ని సైబర్ నేరగాళ్లు తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారు. పండుగ పూట సంతోషంగా ఉండే సామాన్యులను లక్ష్యంగా చేసుకుని, వారు సరికొత్త మోసాలకు తెరలేపుతున్నారు. ఆకర్షణీయమైన బహుమతులు, భారీ తగ్గింపు ధరలు, లక్కీ డ్రాల పేరుతో అమాయకులను బుట్టలో వేసుకుని.. అందినకాడికి దోచుకుంటున్నారు. ప్రస్తుత రోజుల్లో ప్రతి ఒక్కరి చేతిలో స్మార్ట్‌ఫోన్ ఉండటంతో.. నేరగాళ్లు వాట్సాప్ , ఈ-మెయిల్ ద్వారా ఫేక్ మెసేజ్‌లను సందేశాలను పంపిస్తున్నారు. 'మీకు క్రిస్మస్ కానుకగా ఖరీదైన ఫోన్ లభించింది అని లేదా.. నూతన సంవత్సర లక్కీ డ్రాలో మీరు విజేతగా నిలిచారు అంటూ.. మెసేజ్‌లను పంపి, వాటి కింద ఒక గుర్తు తెలియని లింక్ ఇస్తున్నారు.ఆ లింక్‌లపై క్లిక్ చేసిన వెంటనే.. వినియోగదారుడికి తెలియకుండానే వారి ఫోన్‌లో హానికరమైన సాఫ్ట్‌వేర్ ఇన్ స్టాల్ అవుతుంది. దీనివల్ల ఫోన్‌లోని వ్యక్తిగత సమాచారం, ఫోటోలు,సందేశాలు నేరగాళ్ల చేతికి చిక్కుతాయి. ప్రముఖ ఈ-కామర్స్ సంస్థల పేర్లను పోలి ఉండేలా నకిలీ వెబ్‌సైట్లు, అప్లికేషన్‌లను సృష్టించడం ఈ మధ్య కాలంలో పెరిగిపోయింది. పదివేల రూపాయల విలువైన వస్తువు కేవలం వెయ్యి రూపాయలకే లభిస్తుందని నమ్మిస్తారు. ఆ వస్తువును ఆర్డర్ చేసే క్రమంలో మీ బ్యాంకు వివరాలు లేదా క్రెడిట్ కార్డు సమాచారాన్ని నమోదు చేయమని కోరతారు. ఒక్కసారి ఆ వివరాలు ఇస్తే.. మీ ఖాతాలోని సొమ్ము మొత్తం నిమిషాల వ్యవధిలోనే మాయమవుతుంది. పండుగలకు సొంత ఊళ్లకు వెళ్లే వారి రద్దీని ఆసరాగా చేసుకుని.. తక్కువ ధరకే విమాన లేదా బస్సు టిక్కెట్లు ఇస్తామంటూ నకిలీ ట్రావెల్ వెబ్‌సైట్ల ద్వారా బుకింగ్‌లు చేసుకుని మోసగిస్తున్నారు. ముఖ్యంగా హైదరాబాద్ నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లే వారిని వీళ్లు టార్గెట్ చేసి మేసేజ్‌లు పంపిస్తున్నారు.సైబర్ నేరగాళ్లు కేవలం సాంకేతికతనే కాకుండా.. మనుషుల బలహీనతలను కూడా వాడుకుంటారు. పండుగ సమయంలో ఏదైనా ఉచితంగా వస్తుందంటే ఎవరైనా ఆకర్షితులవుతారనేది వారి నమ్మకం. వీటి బారిన పడకుండా ఉండాలంటే.. కొన్ని సూచలను పాటిస్తే సరిపోతుంది. ఏవైనా ఆఫర్లు లేదా తగ్గింపులు కావాలంటే, నేరుగా సంబంధిత సంస్థ అధికారిక వెబ్‌సైట్‌కు వెళ్లి తనిఖీ చేయండి. వాట్సాప్‌లో వచ్చే గుర్తు తెలియని మెసేజ్‌లను అసలు క్లిక్ చేయకపోవడం మంచిందని నిపుణులు సూచిస్తున్నారు. వెబ్‌సైట్ చిరునామాలో ఉందో లేదో గమనించండి. అందులో 'ం' అంటే భద్రత (సెక్యూరిటీ) అని అర్థం.

## యాదాద్రి నరసన్నకు సిరిసిల్ల నేతన్న అపురూప కానుక..

తెలంగాణ చేనేత కళాకారుడు నల్ల విజయ్ కుమార్.. యాదాద్రి లక్ష్మీనరసింహ స్వామి వారి కోసం రెండు గ్రాముల బంగారంతో అగ్గిపెట్టెలో ఇమిడేలా ప్రత్యేక పట్టుచీరను రూపొందించారు. తన తండ్రి వారసత్వాన్ని కొనసాగిస్తూ.. గాలికి ఎగిరేంత తేలికైన వస్త్రాలను నేయడంలో సిద్ధహస్తుడైన విజయ్ కుమార్, చేనేత రంగానికి పూర్వ వైభవం తీసుకురావడానికి ఇలాంటి వినూత్న ప్రయోగాలు చేస్తున్నారు. తెలంగాణ చేనేత కళాకారులు తమ అసాధారణ ప్రతిభతో విశ్వఖ్యాతిని సొంతం చేసుకున్నారు. అగ్గిపెట్టెలో ఇమిడే పట్టుచీరలను నేయడంలో మన కళాకారుల నైపుణ్యం సాటిలేనిది. ఈ వారసత్వాన్ని అందిపుచ్చుకున్న సిరిసిల్ల జిల్లా కేంద్రానికి చెందిన చేనేత కళాకారుడు నల్ల విజయ్ కుమార్.. తన తండ్రి పరంపరను కొనసాగిస్తూ తాజాగా మరో అద్భుతాన్ని ఆవిష్కరించారు. యాదాద్రి లక్ష్మీనరసింహ స్వామి వారి కోసం ప్రత్యేకంగా రూపొందించిన బంగారు పట్టుచీరను ఆలయ అధికారులకు అందజేసి తన భక్తిని చాటుకున్నారు.ఈ అద్భుత కళాఖండాన్ని సృష్టించేందుకు విజయ్ కుమార్ రెండు గ్రాముల బంగారాన్ని వినియోగించారు. 5.30 మీటర్ల పొడవు, 48 ఇంచుల వెడల్పు ఉన్న ఈ చీరను కేవలం



వారం రోజుల వ్యవధిలోనే అగ్గిపెట్టెలో ఇమిడేలా అత్యంత సూక్ష్మంగా రూపొందించడం విశేషం. బుధవారం యాదాద్రిని దర్శించుకున్న ఆయన.. ఆలయ ఏఈవో రఘు, ప్రధానార్చకులు కాండూరి వెంకటాచార్యులకు ఈ అపురూప కానుకను సమర్పించారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. విజయ్ కుమార్ తన తండ్రి నుంచి నేర్చుకున్న మెలకువలతో ఎన్నో అద్భుతాలను సృష్టించారు. గాలికి ఎగిరేంత తేలికగా ఉండే వస్త్రాలను తయారు చేయడంలో ఆయన సిద్ధహస్తుడు. కేవలం అగ్గిపెట్టెలోనే కాకుండా, ఉంగరం లోంచి దూరిపోయే చీరలను కూడా ఆయన గతంలో నేసి అందరినీ ఆశ్చర్యపరిచారు. చేనేత రంగానికి పూర్వ వైభవం తీసుకురావాలనే లక్ష్యంతో ఆయన ఇలాంటి వినూత్న ప్రయోగాలు చేస్తున్నారు. ప్రభుత్వ ప్రోత్సాహం ఉంటే చేనేత రంగంలో మరిన్ని అద్భుతాలు చేస్తామని వెల్లడించారు.తమ కులవృత్తి నైపుణ్యాన్ని దైవ కార్యాలకు వినియోగించడంలో విజయ్ కుమార్ ఎప్పుడూ ముందుంటారు. గతంలోనూ ఇలాంటి అరుదైన చీరలను తిరుమల తిరుపతి దేవస్థానం, వేములవాడ రాజన్న, విజయవాడ కనకదుర్గమ్మ వంటి ప్రముఖ ఆలయాలకు కానుకగా అగ్గిపెట్టలో పట్టే వెండి, బంగారం చీరలను సమర్పించి వార్తల్లో నిలిచారు. పారిశ్రామికీకరణ పెరుగుతున్న ప్రస్తుత తరుణంలో.. తమ పూర్వీకుల హస్తకళా నైపుణ్యాన్ని కాపాడుకుంటూ ప్రపంచ వ్యాప్తంగా తెలంగాణ చేనేత ఖ్యాతిని నల్ల విజయ్ కుమార్ చాటుతున్నారు.

## రోడ్లపై పశువులను విడిచిపెట్టే వారికి అలర్ట్..



మంథని పట్టణంలో రోడ్లపై తిరుగుతున్న పశువుల సమస్యను పరిష్కరించేందుకు మున్సిపల్ కమిషనర్ ఎన్. మనోహర్ కీలక ప్రకటన చేశారు. కపిల గోశాలతో కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం.. యజమానులు తమ ఆవులను గోశాలలో ఉంచాలనుకుంటే నెలకు 300 రూపాయలు చెల్లించి సంరక్షించుకోవచ్చు. ఒకవేళ పశువుల భారం భరించలేమనుకుంటే వాటిని గోశాలకు ఉచితంగా అప్పగించవచ్చు. గోశాల సంరక్షణలో ఉన్న ఆవు చనిపోతే దానికి బదులుగా మరొక ఆవును తిరిగి ఇస్తామని అధికారులు హామీ ఇచ్చారు. ఈ నిబంధనలు పాటించకుండా పశువులను రోడ్లపైకి వదిలే యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ హెచ్చరించారు. మంథని పట్టణంలో నిత్యం ఎదురవుతున్న ట్రాఫిక్ సమస్యలు, రోడ్డు ప్రమాదాలను అరికట్టడానికి మంథని పురపాలక శాఖ ఒక వినూత్నమైన ప్రణాళికను సిద్ధం చేసింది. ముఖ్యంగా రహదారులపై సంచరిస్తున్న పశువుల కారణంగా వాహనదారులు, పాదచారులు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని.. మున్సిపల్ కమిషనర్ ఎన్. మనోహర్ పశువుల యజమానులకు హెచ్చరికలతో కూడిన ఒక ప్రకటనను విడుదల చేశారు. పట్టణంలోని పశువులను సంరక్షించడానికి, వాటి వల్ల రోడ్లపై ప్రమాదాలు జరగకుండా చూడటానికి మున్సిపల్ అధికారులు స్థానిక కపిల గోశాల యాజమాన్యంతో ఒక ప్రత్యేక ఒప్పందాన్ని కుదుర్చుకున్నారు.దీని ప్రకారం పశువుల యజమానులకు రెండు రకాల అవకాశాలను కల్పించారు. యజమానులు తమ పశువులను రోడ్లపై వదలకుండా గోశాలలో ఉంచాలనుకుంటే.. ఒక్కో ఆవుకు నెలకు 300 రూపాయల చొప్పున కాపలాదారునికి చెల్లించాల్సి ఉంటుంది. ఈ సొమ్ముతో గోశాల వారు ఆ పశువులకు ఆహారం, నీరు , సంరక్షణ కల్పిస్తారు. ఒకవేళ యజమానులు తమ పశువుల సంరక్షణ బాధ్యతను పూర్తిగా తీసుకోలేమని భావిస్తే.. వాటిని గోశాలకు ఉచితంగా అప్పగించవచ్చు. అప్పుడు గోశాల వారే వాటిని పూర్తిగా సంరక్షిస్తారు. అంతేకాకుండా.. ఈ ఒప్పందంలో ఒక కీలకమైన హామీ కూడా ఉంది. ఒకవేళ గోశాల సంరక్షణలో ఉన్న ఆవు ఏదైనా కారణం చేత మరణిస్తే.. సదరు యజమానికి గోశాల నుండి మరొక ఆవును తిరిగి ఇచ్చేలా అధికారులు అంగీకారం కుదుర్చుకున్నారు. మంథని వంటి పెరుగుతున్న పట్టణాల్లో పశువులు రోడ్లపై ఉండటం వల్ల కేవలం ట్రాఫిక్ సమస్యలే కాకుండా..

## రేషన్ కార్డుదారులకు అలర్ట్..



తెలంగాణ రేషన్ కార్డు లబ్ధిదారులకు అలర్ట్. జనవరి నుంచి సన్నబియ్యం కోటా పొందాలంటే.. కార్డులోని సభ్యులందరూ ఈ నెలాఖరులోపు ఈ-కేవైసీ పూర్తి చేయాలి. గడువులోపు వేలిముద్రలు వేయని వారికి రేషన్ నిలిపివేస్తామని.. 5 ఏళ్ల లోపు పిల్లలకు మినహాయింపునిచ్చామని అధికారులు తెలిపారు. తెలంగాణలోని రేషన్ కార్డు లబ్ధిదారులకు అలర్ట్. జనవరి నుంచి ప్రభుత్వం పంపిణీ చేసే సన్నబియ్యం కోటాను పొందాలంటే.. కార్డులో పేరున్న సభ్యులందరూ ఈ నెలాఖరులోపు ఈ-కేవైసీ ప్రక్రియను పూర్తి చేయాలి. గత రెండు ఏళ్లుగా ఈ ప్రక్రియ కొనసాగుతున్నప్పటికీ.. ఇంకా కోట్లాది మంది లబ్ధిదారులు అప్‌డేట్ చేసుకోకపోవడంతో ప్రభుత్వం డిసెంబర్ 31ని తుది గడువుగా నిర్ణయించింది. ఈ గడువులోపు వేలిముద్రలు వేయని వారికి రేషన్ బియ్యం నిలిపివేస్తామని అధికారులు స్పష్టం చేశారు. అయితే.. 5 ఏళ్ల లోపు చిన్నపిల్లలకు మాత్రం ఈ నిబంధన నుండి మినహాయింపునిచ్చారు. ప్రస్తుతం తెలంగాణలో రేషన్ కార్డుల సంఖ్య 1.01 కోట్లుగా ఉండగా.. లబ్ధిదారుల సంఖ్య 3.25 కోట్లకు చేరింది. రేవంత్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కొత్తగా 11.27 లక్షల కార్డులను పంపిణీ చేయగా.. సుమారు 34 లక్షల మంది కొత్త లబ్ధిదారులుగా చేరారు. పాత కార్డులకు సంబంధించి 80 శాతం కేవైసీ పూర్తయినప్పటికీ.. కొత్తగా మంజూరైన కార్డుల్లో కేవలం 40 శాతం మంది మాత్రమే బయోమెట్రిక్ పూర్తి చేశారు. గడువు దగ్గర పడుతుండటంతో రేషన్ దుకాణాల వద్ద భారీ క్యూలు కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో గడువును ఫిబ్రవరి వరకు పొడిగించాలని ప్రజల నుంచి విన్నపాలు అందుతున్నాయి. ఈ-కేవైసీ అనేది కేవలం బియ్యం కోసమే కాకుండా.. ఇతర ప్రభుత్వ పథకాలకు ముఖ్యమైన కీ లాంటిది. ఈ కేవైసీ పూర్తి చేసుకున్న వారికే సన్నబియ్యం లభిస్తుంది. దాంతో పాటు రూ. 500లకే గ్యాస్ సిలిండర్ పథకం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ వంటి పథకాలకు రేషన్ కార్డు లింకు ఉండటంతో ఈ కేవైసీ కంపల్సరీ చేశారు. భవిష్యత్తులో అమలయ్యే ఇతర సంక్షేమ పథకాలకు దీని ద్వారా అర్హత లభిస్తుంది. కార్డులోని సభ్యులందరూ ఆధార్ కార్డు, రేషన్ కార్డు జిరాక్స్ ప్రతులతో సమీపంలోని రేషన్ దుకాణానికి వెళ్లి ఈ-పాస్ యంత్రంలో వేలిముద్రలు వేయాలి. వేలిముద్రలు సరిగ్గా పడటానికి చేతులను శుభ్రంగా ఉంచుకోవాలి. సాంకేతిక కారణాల వల్ల బయోమెట్రిక్ పడకపోతే అసహనం చెందకుండా మరో రోజు వెళ్లడం మంచిది. డీలర్లు కూడా దుకాణాల వద్ద అందుబాటులో ఉంటూ.. ప్రజలకు అవగాహన కల్పించేలా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది.ప్రభుత్వం కొత్తగా మంజూరు చేసిన 11 లక్షల కార్డుదారుల్లో కొంత ఆందోళన నెలకొంది. పాత కార్డుదారులకు ఉచిత విద్యుత్, గ్యాస్ సబ్సిడీ అందుతున్నాయని తమకు మాత్రం ఇంకా వర్తించడం లేదని వారు వాపోతున్నారు. అయితే, ఈ-కేవైసీ ప్రక్రియను త్వరగా పూర్తి చేయడం ద్వారా డేటా అప్‌డేట్ అయ్యి.. క్రమంగా అన్ని పథకాలు అందరికి వర్తిస్తాయని అధికారులు పేర్కొంటున్నారు.

## ఆ జిల్లాలో పత్తి ధరలు తగ్గించిన సీసీఐ..

ఆదిలాబాద్ జిల్లాలో పత్తి రైతులకు సి సి ఐ షాక్ ఇచ్చింది. పత్తి నాణ్యత లేదనే సాకుతో క్వింటాల్‌కు రూ. 50 తగ్గిస్తూ నిర్ణయం తీసుకుంది. దీంతో కొత్త ధర రూ. 8,050గా మారింది. పత్తి పింజా పొడవు తగ్గడమే దీనికి కారణమని అధికారులు చెబుతున్నారు. ధర తగ్గింపుతో పాటు.. కొనుగోలు పరిమితిని ఎకరాకు 12 నుండి 7 క్వింటాళ్లకు కుదించడంపై రైతులు మండిపడుతున్నారు. అలాగే 'కపాస్ కిసాన్ యాప్' ద్వారా స్లాట్ బుకింగ్ నిబంధన, తేమ శాతం పరిమితులు గ్రామీణ రైతులకు శాపంగా మారాయి. తెలంగాణలో పత్తి సాగుకు పురిటిగడ్డగా పేరొందిన ఆదిలాబాద్ జిల్లాలో పత్తి రైతులు ప్రస్తుతం తీవ్ర సంక్షోభంలో మునిగిపోయారు. కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (జజ×) తాజాగా పత్తి కొనుగోలు ధరలను తగ్గిస్తూ తీసుకున్న నిర్ణయం అన్నదాతల పాలిట పిడుగులా మారింది. నాణ్యత సాకుతో ఇప్పటికే ఇబ్బందులు పెడుతున్న అధికారులు.. ఇప్పుడు క్వింటాల్ పత్తి ధరపై ఏకంగా యాభై రూపాయలు కోత విధించారు. దీంతో కొత్త ధర 8 వేల 50 రూపాయలుగా నిర్ణయించారు.సిసిఐ అధికారులు ఈ ధర తగ్గింపుకు విచిత్రమైన కారణాలను చూపుతున్నారు. పత్తిలో ఉండే పింజా పొడవు (స్టెపులే లెంగ్త్) తక్కువగా ఉందని.. అందుకే నాణ్యత లేని పత్తిగా పరిగణించి ధర తగ్గించామని చెబుతున్నారు. ఈ కొత్త ధరలు ఈ నెల 22వ తేదీ నుండి అమలులోకి రానున్నాయి. అయితే.. పంట సాగు సమయంలో వాతావరణ మార్పులు, అకాల వర్షాల వల్ల పింజా పొడవులో స్వల్ప మార్పులు రావడం సహజమని.. దీనిని సాకుగా చూపి ధర తగ్గించడం అన్యాయమని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేవలం ధర తగ్గింపు మాత్రమే కాకుండా.. కొనుగోలు పరిమితుల్లో కూడా సిసిఐ భారీగా కోత విధించింది. గత ఏడాది ఎకరాకు 12 క్వింటాళ్ల పత్తిని సేకరించిన సిసిఐ.. ఈసారి ఆ పరిమితిని కేవలం 7 క్వింటాళ్లకు కుదించింది. అంటే ఎకరాకు 5 క్వింటాళ్ల దిగుబడిని రైతులు బహిరంగ మార్కెట్లో దళారులకు తక్కువ ధరకు అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. పత్తిలో తేమ 8 నుండి 12 శాతం మించకూడదనే నిబంధన రైతులను వేధిస్తోంది. చలికాలం ప్రభావంతో తేమ సహజంగానే ఎక్కువగా ఉంటుందని..






## విదేశీ టీ20 లీగ్‌లలో కోహ్లి, రోహిత్?




భారత క్రికెటర్లు విదేశీ టీ 20 లీగ్‌లలో ఆడే అవకాశం సమీప భవిష్యత్తులో లేదని ఐపీఎల్ ఛైర్మన్ అరుణ్ సింగ్ ధూమల్ స్పష్టం చేశారు. ఆటగాళ్లపై అధిక పనిభారం, దేశవాళీ క్రికెట్ ఆడాలనే నిబంధనలు దీనికి ప్రధాన కారణాలని ఆయన తెలిపారు. విరాట్ కోహ్లీ – రోహిత్ శర్మ వంటి స్టార్ ఆటగాళ్లు కూడా దేశవాళీ టోర్నీల్లో పాల్గొనాల్సి ఉన్నందున విదేశీ లీగ్‌లకు వెళ్లే ప్రసక్తే లేదని ఆయన పేర్కొన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న టీ20 లీగ్‌లతో పోల్చితే ఇండియన్ ప్రీమియర్ లీగ్‌కి ఒక ప్రత్యేకత ఉంది. ఏ దేశానికి చెందిన ఆటగాళ్లు అయినా భారత్‌కి వచ్చి ఐపీఎల్‌లో ఆడొచ్చు, కానీ టీమిండియాలో యాక్టివ్‌గా కొనసాగుతున్న ఏ ప్లేయర్ కూడా విదేశీ లీగ్‌లలో ఆడటానికి లేదు. దాంతోనే ఐపీఎల్‌కు ఉన్న క్రేజ్ మరే ఇతర లీగ్‌లకు లేదు. అయితే, కొంతకాలంగా రోహిత్ శర్మ , విరాట్ కోహ్లిని విదేశీ లీగ్‌లలో ఆడించాలనే ప్రయత్నం జరుగుతోంది. ముఖ్యంగా ఆస్ట్రేలియా వేదికగా జరుగుతున్న బిగ్ బాష్ లీగ్‌లో ఈ ఇద్దరు లెజెండ్స్ ఆడితే తమకు టీఆర్పీతో పాటు లీగ్‌కు ఫేమ్ వస్తుందని క్రికెట్ ఆస్ట్రేలియా గతంలో కూడా చెప్పింది. కానీ టెస్టు, టీ20లకు రిటైర్మెంట్ ప్రకటించిన ఈ ఇద్దరు బ్యాటర్లు వన్డేల్లో కొనసాగుతుండటంతో వాళ్లకి అవకాశం లేకుండా పోయింది. ఇలాంటి పరిస్థితుల్లో భారత ఆటగాళ్లు భవిష్యత్తులో విదేశీ టీ20 లీగ్‌ల్లో పాల్గొనే అవకాశం ఉందా? అనే ప్రశ్నపై ఐపీఎల్ ఛైర్మన్ అరుణ్ సింగ్ ధూమల్ స్పష్టత ఇచ్చారు. సమీప భవిష్యత్తులో అలాంటి అవకాశం లేదని ఆయన తేల్చిచెప్పారు. దీనికి ప్రధాన కారణం ఆటగాళ్లపై ఉన్న భారీ వర్క్‌లోడ్ అని వివరించారు. ఈ విషయమై జర్నలిస్ట్ విమల్ కుమార్‌తో మాట్లాడుతూ "మన ఆటగాళ్లపై ఎంతటి వర్క్‌లోడ్ ఉందో మీకే తెలుసు. అంతర్జాతీయ క్రికెటర్లు తప్పనిసరిగా దేశవాళీ క్రికెట్ కూడా ఆడాలనే నిబంధనను బీసీసీఐ తీసుకొచ్చింది. విజయ్ హజారే ట్రోఫీ, సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీల్లో వారు పాల్గొనాల్సి ఉంటుంది. ఇంత క్రికెట్ భారత్‌లోనే ఉన్నప్పుడు, అభిమానులు కూడా ఇక్కడే ఎక్కువగా ఉన్నప్పుడు, విదేశీ లీగ్‌లకు వెళ్లే అవకాశం ఉంటుందని నేను అనుకోవడం లేదు" అని అరుణ్ చెప్పారు. "ప్రస్తుతం పెద్ద ఆటగాళ్లకు అసలు అవకాశం లేదు. కొంతమంది మూడు ఫార్మాట్లలో ఆడుతున్నారు. వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్ చాలా కీలకం. కొందరు బౌలర్లను రెండు టెస్టుల తర్వాత విశ్రాంతి ఇవ్వాల్సి వస్తోంది. వన్డేలు, టీ20ల్లో కూడా వారిని మేనేజ్ చేయాల్సి ఉంటుంది. ఇలాంటి పరిస్థితుల్లో విదేశీ లీగ్‌లకు పంపితే, అది జాతీయ జట్టుపై ప్రతికూల ప్రభావం చూపుతుంది" అని ఆయన అన్నారు. ఐపీఎల్ ఛైర్మన్ అరుణ్ ధుమాల్ చెప్పిన ప్రకారం భారత స్టార్ క్రికెటర్లు విదేశీ టీ20 లీగ్‌ల్లో ఆడే అవకాశం ఇప్పట్లో కనిపించడం లేదు. కోహ్లి, రోహిత్ శర్మ కేవలం ఒక్క ఫార్మాటే ఆడినప్పటికీ దేశీయ క్రికెట్ అయిన విజయ్ హజారే ట్రోఫీ, సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీల్లోనూ ఆడనుండటంతో కచ్చితంగా కుదిరే ప్రసక్త కాదని చెప్పొచ్చు. ఈ లెక్కన చూసుకుంటే కోహ్లి, రోహిత్‌లను విదేశీ లీగ్‌లలో ఆడించాలన్న ఇంగ్లండ్ అండ్ వేల్స్ క్రికెట్ బోర్డు, క్రికెట్ ఆస్ట్రేలియా కోరిక తీరదనే చెప్పాలి.




# డీఆర్ఎస్‌లో ఇంగ్లండ్‌కు అన్యాయం..




యాషెస్ సిరీస్‌లో డీఆర్ఎస్ వివాదంపై ఐసీసీ స్పందించింది. స్నికో మీటర్‌లో సాంకేతిక లోపం వల్ల ఇంగ్లండ్ రివ్యూ విఫలమైందని అంగీకరించి, వారికి రివ్యూను తిరిగి ఇచ్చింది. క్యారీ శతకం పూర్తి చేయడంతో ఇంగ్లండ్‌కు నష్టం జరిగింది. ఈ ఘటనపై ఇంగ్లండ్ క్యాంప్ నుంచి తీవ్ర నిరసనలు వ్యక్తమయ్యాయి. భవిష్యత్తులో ఇలాంటివి జరగకుండా చర్యలు తీసుకుంటామని ఐసీసీ తెలిపింది. రివ్యూ సమయంలోనే బ్యాట్‌కి ఏదో తగిలిందని క్యారీ కూడా స్పష్టం చేసినా ఫలితం లేకుండా పోయింది. యాషెస్ సిరీస్ మూడో టెస్టులో తొలి రోజు చోటు చేసుకున్న వివాదాస్పద ఘటనపై ఎట్టకేలకు ఐసీసీ స్పందించింది. అడిలైడ్ వేదికగా ఇంగ్లండ్‌తో జరుగుతున్న మూడో టెస్టులో ఆస్ట్రేలియా వికెట్‌కీపర్ అలెక్స్ క్యారీకి సంబంధించిన డిసిషన్ రివ్యూ సిస్టమ్ (డీఆరఎస్) విషయంలో సాంకేతిక లోపం జరిగిందని అంగీకరించిన ఐసీసీ, ఇంగ్లండ్ జట్టు కోల్పోయిన రివ్యూను తిరిగి ఇచ్చినట్లు ప్రకటించింది. క్యారీ బ్యాటింగ్ చేస్తున్న సమయంలో బంతి బ్యాట్‌ను స్వల్పంగా తాకినట్టు మైదానంలో స్పష్టంగా కనిపించినా, స్నికో మీటర్‌లో స్పైక్ నమోదు కాకపోవడంతో ఇంగ్లండ్ వేసిన రివ్యూ విఫలమైంది. అప్పటికి క్యారీ 72 పరుగులతో ఉన్నాడు. ఆ నిర్ణయం తర్వాత అతడు శతకం పూర్తి చేయడంతో, ఆ నిర్ణయం ఇంగ్లండ్‌కు భారీ నష్టంగా మారింది. ఈ ఘటనపై ఇంగ్లండ్ క్యాంప్ నుంచి వెంటనే తీవ్ర నిరసనలు వ్యక్తమయ్యాయి. సోషల్ మీడియాలో కూడా ఆసీస్ మరోసారి చీటింగ్ చేసిందంటూ కామెంట్స్ కూడా ఎక్కువయ్యాయి. ఈ నేపథ్యంలో తొలి రోజు ఆట ముగిసిన తర్వాత విడుదల చేసిన ప్రకటనలో, ప్రసార భాగస్వామి బీబీజీ స్పోర్ట్‌తో సంప్రదింపుల అనంతరం ఇంగ్లండ్‌కు రివ్యూను తిరిగి ఇచ్చినట్టు ఐసీసీ వెల్లడించింది. స్నికో మీటర్ ఆడియో క్యాలిబ్రేషన్‌లో లోపం ఉందని బీబీజీ స్పోర్ట్ కూడా అంగీకరించింది. క్యారీ కూడా మైదానంలో ఉన్నప్పుడే నిక్ ఉన్నట్టుగా అంపైర్లకు సంకేతాలిచ్చినట్టు కనిపించాడు. స్టంప్స్ అనంతరం మాట్లాడిన అతడు, టెక్నాలజీని నేరుగా విమర్శించకపోయినా, ఆ సమయంలో గందరగోళం నెలకొందని అంగీకరించాడు. "బంతి వెళ్లేటప్పుడు ఏదో తగిలినట్టు అనిపించింది. ఆ క్షణంలో ప్రాసెస్‌ను నమ్మాల్సిందే. కానీ స్క్రీన్ చూపించిన దానికంటే మైదానంలో ఉన్న ఆటగాళ్లకు విషయం స్పష్టంగా అర్థమైంది" అని క్యారీ అన్నాడు. ఇంగ్లండ్ బౌలింగ్ కన్సల్టెంట్ డేవిడ్ సేకర్ మాత్రం స్నికో విశ్వసనీయతపై ఆందోళన వ్యక్తం చేశాడు. "ఈ సిరీస్ మొత్తం స్నికో క్యాలిబ్రేషన్ సరిగ్గా లేదన్న భావన ఉంది. ఆ సమయంలో అది చాలా కీలక నిర్ణయం. ఇలాంటి తప్పులు బాధిస్తాయి. ఈ రోజుల్లో టెక్నాలజీ ఇంత బేసిక్ విషయాలను గుర్తించలేకపోవడం ఆశ్చర్యంగా ఉంది" అని వ్యాఖ్యానించాడు. ఈ ఘటనను ఐసీసీ వద్ద అధికారికంగా లేవనెత్తాలని ఇంగ్లండ్ అధికారులు ఆలోచించినట్టు సమాచారం. భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా, టెక్నాలజీ ప్రొవైడర్లతో కలిసి విధానాలను మరింత కఠినంగా సమీక్షిస్తామని ఐసీసీ తెలిపింది. రివ్యూను తిరిగి ఇచ్చినా, అప్పటికే ఇంగ్లండ్‌కు జరగాల్సిన నష్టం జరిగింది.

# ఐపీఎల్ వేలం జరిగిన రోజే..

సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ మ్యాచ్ అనంతరం టీమిండియా యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్ కడుపునొప్పితో ఆస్పత్రి పాలయ్యాడు. వైద్యులు 'అక్యూట్ గ్యాస్ట్రోఎంటరైటిస్'గా నిర్ధారించారు. ప్రస్తుతం విశ్రాంతి సూచించారు. ఇటీవల అద్భుత ఫామ్‌లో ఉన్న జైస్వాల్, జనవరిలో జరగబోయే భారత జట్టు కార్యక్రమాలకు ముందు కోలుకుంటాడని అంచనా. సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో ఆస్పత్రిపాలయిన యశస్వి జైస్వాల్ ఆరోగ్య పరిస్థితులపై బీసీసీఐ ఇప్పటి వరకు ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. ఐపీఎల్ వేలం హడావుడి ఒకవైపు జరుగుతుంటే.. మరోవైపు టీమిండియా యంగ్ ఓపెనర్ హాస్పిటల్ బెడ్‌పైకి వెళ్లి వార్తల్లో నిలిచాడు. సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ సూపర్ లీగ్ మ్యాచ్ ముగిసిన గంటల్లోనే అతన్ని ఆస్పత్రికి తరలించారు. పుణేలో రాజస్థాన్‌తో జరిగిన మ్యాచ్ సమయంలోనే జైస్వాల్‌కు కడుపులో నొప్పి మొదలైందని సమాచారం. మ్యాచ్ ముగిసిన తర్వాత ఆ నొప్పి తీవ్రంగా మారడంతో వెంటనే పింప్రీ–చించ్‌వాడ్‌లోని ఆదిత్య బిర్లా ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ వైద్యులు పరీక్షలు నిర్వహించి, అతడికి అక్యూట్ గ్యాస్ట్రో ఎంటరైటిస్ ఉన్నట్లు




నిర్ధారించారు. వైద్యుల సూచన మేరకు జైస్వాల్‌కు ఇంట్రావీనస్ మందులు అందించడంతో పాటు యూఎస్‌జీ, సీటీ స్కాన్‌లు కూడా చేశారు. ప్రస్తుతం విశ్రాంతి తీసుకుంటూ మందులు కొనసాగించాలని సూచించినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం పరిస్థితి నిలకడగానే ఉందని, కొద్ది రోజులు రెస్ట్ అవసరమని వైద్యులు సూచించారు. ఆరోగ్య సమస్యలు ఉన్నప్పటికీ జైస్వాల్ ఆ మ్యాచ్‌లో ఆడటం గమనార్హం. ముంబై తరఫున ఆడి16 బంతుల్లో 15 పరుగులు చేశాడు. అదే మ్యాచ్‌లో అజింక్య రహానే 72, సర్ఫరాజ్ ఖాన్ కేవలం 22 బంతుల్లో 73 పరుగులతో మెరిశారు. ఈ ఇన్నింగ్స్‌లతో ముంబై మూడు వికెట్ల తేడాతో గెలిచినా, టోర్నీ నుంచి నిష్క్రమించింది. మ్యాచ్ సమయంలోనే జైస్వాల్ అసౌకర్యంగా కనిపించాడని, మ్యాచ్ తర్వాత పరిస్థితి మరింత తీవ్రమవడంతో తక్షణమే వైద్య సహాయం అవసరమైందని క్రికెట్ వర్గాలు తెలిపాయి. ఈ అంశంపై బీసీసీఐ ఇప్పటివరకు అధికారిక ప్రకటన ఇవ్వలేదు, అయితే త్వరలోనే అప్డేట్ వచ్చే అవకాశం ఉంది. ఇటీవల జైస్వాల్ అద్భుత ఫామ్‌లో ఉన్నాడు. సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో మూడు మ్యాచ్‌ల్లో 145 పరుగులు చేశాడు. అలాగే దక్షిణాఫ్రికాతో జరిగిన వన్డే సిరీస్‌లో మూడు మ్యాచ్‌ల్లో 156 పరుగులు చేసి, తన తొలి వన్డే శతకం కూడా నమోదు చేశాడు. ప్రస్తుతం అంతర్జాతీయ మ్యాచ్‌లు లేకపోవడంతో, జనవరి మధ్యలో జరిగే భారత జట్టు కార్యక్రమాలకు ముందు జైస్వాల్ పూర్తిగా కోలుకునే అవకాశముందని అంచనా వేస్తున్నారు.

# టీమిండియా రికార్డ్ బద్దలుగొట్టారుగా..




న్యూజిలాండ్, వెస్టిండీస్ మధ్య జరుగుతున్న మూడో టెస్టులో ఓపెనర్లు డెవాన్ కాన్వే, టామ్ లాథమ్ అద్భుత ప్రదర్శన చేశారు. వరల్డ్ టెస్ట్ ఛాంపియన్ షిప్ చరిత్రలో అత్యధిక ఓపెనింగ్ భాగస్వామ్యం నెలకొల్పిన ప్లేయర్లుగా నిలిచారు. వీరిద్దరూ కలిసి 323 పరుగులు చేశారు. 95 ఏళ్ల నాటి న్యూజిలాండ్ రికార్డును కూడా అధిగమించారు ఈ ప్లేయర్లు. 2019లో టీమిండియా ప్లేయర్లు నమోదు చేసిన రికార్డును బద్దలుగొట్టారు. ఐసీసీ వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్‌లో భాగంగా న్యూజిలాండ్, వెస్టిండీస్ మధ్య మూడు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్ జరుగుతున్న విషయం తెలిసిందే. మొదటి మ్యాచ్ డ్రాగా ముగిసింది. రెండో మ్యాచ్‌లో న్యూజిలాండ్ 9 వికెట్ల తేడాతో గెలిచింది. సిరీస్ కైవసం చేసుకోవాలని దూకుడు మీద ఉన్న కివీస్ జట్టు.. మూడో టెస్ట్ మ్యాచ్‌లోనూ అదరగొడుతోంది. మౌంట్ మౌంగనూయిలోని బే ఓవల్‌లో జరిగిన ఈ మ్యాచ్‌లో.. టాస్ గెలిచిన మొదట బ్యాటింగ్ ఎంచున్న న్యూజిలాండ్ అద్భుత ప్రదర్శన చేసింది. తొలి రోజు ఆట ముగిసే సమయానికి.. ఓపెనర్లు డెవాన్ కాన్వే, టామ్ లాథమ్ కలిసి అద్భుతమైన భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. దీంతో 95 ఏళ్ల చరిత్రను తిరగరాశారు. విచిత్రం ఏంటంటే.. ఇటీవల అబుదాబి వేదికగా జరిగిన ఐపీఎల్ 2026 వేలంలో డెవాన్ కాన్వే అన్‌సోల్డ్‌గా మిగిలిపోయాడు. కానీ ఈ మ్యాచ్‌లో అద్భుత ప్రదర్శన చేశాడు. ఆట ముగిసే సమయానికి 178 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. మరోవైపు కివీస్ సారథి టామ్ లాథమ్ కూడా 137 పరుగులు బాదాడు. వీరిద్దరి పార్టనర్‌షిప్ 323 పరుగులకు చేరింది. అయితే ఇది వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ చరిత్రలో అత్యధిక ఓపెనింగ్ భాగస్వామ్యం కావడం విశేషం. దీంతో 2019లో టీమిండియా ప్లేయర్లు రోహిత్ శర్మ, మయాంక్ అగర్వాల్ కలిసి చేసిన 317 పరుగుల పార్టనర్‌షిప్‌ను బద్దలుగొట్టారు. ఇప్పుడు డబ్ల్యూటీసీ చరిత్రలో అతిపెద్ద ఓపెనింగ్ భాగస్వామ్యాల జాబితాలో డెవాన్ కాన్వే, టామ్ లాథమ్ తొలిస్థానంలో ఉన్నారు. డెవాన్ కాన్వే, టామ్ లాథమ్ చేసిన పార్టనర్‌షిప్.. డబ్ల్యూటీసీ చరిత్రలోనే కాకుండా.. న్యూజిలాండ్ క్రికెట్ చరిత్రలో కూడా ఒక మైలురాయిగా నిలిచింది. 95 సంవత్సరాల క్రితం నాటి రికార్డును ఈ ప్లేయర్లు బ్రేక్ చేశారు. 1930లో చార్లెస్ స్టీవర్ట్ డెంప్స్టర్, జాన్ ఎర్నెస్ట్ మిల్స్.. ఇంగ్లాండ్‌పై 276 పరుగుల పార్టనర్‌షిప్‌ను నెలకొల్పారు. ఈ రికార్డును తాజాగా కాన్వే, లాథమ్ అధిగమించడం విశేషం. మొత్తంగా న్యూజిలాండ్ టెస్ట్ క్రికెట్ చరిత్రలో చూసుకుంటే.. వీరిద్దరిది రెండో అత్యధిక ఓపెనింగ్ భాగస్వామ్యం. 1972లో గ్లెన్ టర్నర్, టెర్రీ జార్విస్ వెస్టిండీస్‌పై 387 పరుగుల పార్టనర్‌షిప్ నెలకొల్పారు. మూడో టెస్టు మొదటి రోజు న్యూజిలాండ్‌కు ప్రత్యేకంగా మారింది. డెవాన్ కాన్వే, టామ్ లాథమ్ ఆటతీరు.. వారు సాధించిన భాగస్వామ్యం ఆకట్టుకుంది. తమ అద్భుతమైన ప్రదర్శనతో న్యూజిలాండ్ జట్టు మొదటి రోజే వెస్టిండీస్‌పై పట్టు సాధించింది. ఈ ప్లేయర్లు సాధించిన ఈ ఘనత భవిష్యత్‌లో యంగ్ క్రికెటర్లకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని చెప్పొచ్చు.




## కన్నెపిట్టరో కన్నుకొట్టరో..




అడివి శేష్, మృణాల్ ఠాకూర్ జంటగా నటిస్తున్న 'డెకాయిట్' సినిమా టీజర్ వచ్చేసింది. ఇది ఒక మాస్ యాక్షన్ లవ్ స్టోరీ అనిపిస్తోంది. అనురాగ్ కశ్యప్, ప్రకాష్ రాజ్, సునీల్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. 'కన్నెపిట్టరో కన్ను కొట్టరో' పాట రీమిక్స్ తో టీజర్ ఆకట్టుకుంది. విజువల్స్, భీమ్స్ సంగీతం సినిమాపై అంచనాలు పెంచాయి. 2026 ఉగాదికి థియేటర్లలో విడుదల కానుంది. అడివి శేష్ హీరోగా నటిస్తున్న లేటెస్ట్ మూవీ 'డెకాయిట్'. షానీల్ డియో దర్శకత్వం వహిస్తున్న ఈ బైలింగ్వల్ సినిమాలో మృణాల్ ఠాకూర్ హీరోయిన్ గా నటిస్తోంది. అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పణలో సుప్రియ యార్లగడ్డ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. 2026 ఉగాది పండగని పురస్కరించుకుని మార్చి 19న థియేటర్లలో రిలీజ్ చేయాలని ప్లాన్ చేస్తున్నారు. ప్రమోషన్స్ లో భాగంగా తాజాగా టీజర్‌ను లాంచ్ చేశారు.' డెకాయిట్ ' అనౌన్స్ మెంట్ వీడియోతోనే డిఫరెంట్ కాన్సెప్ట్ తో రాబోతున్నట్లు క్లారిటీ ఇచ్చారు. ఇప్పటి వరకూ ఎక్కువగా క్లాస్ గా స్టైలిష్ యాక్షన్ సినిమాలతో అలరించిన అడివి శేష్.. ఈసారి మాస్ క్యారెక్టర్ చేస్తున్నాడని అందరికీ అర్థమైంది. ఇప్పుడు టీజర్ ను అవుట్ అంట్ యాక్షన్ సన్నివేశాలతో కట్ చేసారు. 'ఇది ఒక ప్రేమకథ' అనే ట్యాగ్ లైన్ కి తగ్గట్టుగా ఓ వైలెంట్ లవ్ స్టోరీ ఉండబోతోందని హింట్ ఇచ్చారు. శేష్ మాస్ రోల్ లో చాలా ఈజ్ తో కనిపించారు. మృణాల్ ఠాకూర్ కూడా వైవిధ్యమైన క్యారక్టర్ ప్లే చేసినట్లు తెలుస్తోంది. హీరో హీరోయిన్ల మధ్య లవ్ స్టోరీని కొత్తగా డీల్ చేసినట్లు అర్థమవుతోంది. ఇందులో అనురాగ్ కశ్యప్ కీలక పాత్రలో కనిపిస్తుండగా.. ప్రకాష్ రాజ్, సునీల్ ఇతర పాత్రలు పోషించారు. అక్కినేని నాగార్జున నటించిన 'హలో బ్రదర్' సినిమాలోని 'కన్నెపిట్టరో కన్ను కొట్టరో' పాటను రీమిక్స్ చేసి ఈ టీజర్ లో వాడారు. అనురాగ్ కశ్యప్ కూడా ఆ సాంగ్ ని హమ్ చేయడం చూస్తుంటే, సినిమా మొత్తంలో అక్కడక్కడా వినిపిస్తుందనిపిస్తోంది. విజువల్స్, భీమ్స్ బ్యాగ్రౌండ్ స్కోర్ స్పెషల్ అట్రాక్షన్ గా నిలిచాయి. ఓవరాల్ గా 'డెకాయిట్' టీజర్ సినిమాపై ఇంట్రెస్ట్ క్రియేట్ చేసేలా ఉంది.

## టాలీవుడ్ సీతామహాలక్ష్మి

'సీతారామం' సినిమాతో తెలుగు ప్రేక్షకులను మాయ చేసిన అందాల భామ మృణాల్.. టాలీవుడ్ లో క్రేజీ హీరోయిన్ గా మారిపోయింది. అయితే క్రేజ్ ఉంది కదా అని, ఏది పడితే అది చేయకుండా.. కథల ఎంపికలో ఆచితూచి అడుగులు వేస్తోంది. సోషల్ మీడియాలో తన గ్లామరస్ ఫోటోషూట్లతో హల్చల్ చేసే ఈ బ్యూటీ.. లేటెస్టుగా మరాఠీ వస్త్రధారణలో మెరిసిపోయింది. సంప్రదాయబద్ధంగా చీరకట్టుకొని, కొప్పున పూలు పెట్టుకొని ఎంతో అందంగా కనిపించింది. 'కొద్దిగా మోడ్రన్.. పూర్తిగా మరాఠీ' అంటూ ఆమె తన ఇన్‌స్టాగ్రామ్ లో పోస్ట్ చేసిన ఫోటోలు ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతున్నాయి.



# నిధి అగర్వాల్‌కి చేదు అనుభవం..



రాజాసాబ్ సినిమా ప్రమోషన్స్ లో భాగంగా జరిగిన ఓ ఈవెంట్ లో నటి నిధి అగర్వాల్ కు చేదు అనుభవం ఎదురైంది. అభిమానులు ఆమెను చుట్టుముట్టి, తాకే ప్రయత్నం చేయడంతో తీవ్ర ఇబ్బందికి గురైంది. ఈ సంఘటనపై నెటిజన్లు, గాయని చిన్మయి శ్రీపాద తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్వాహకుల వైఫల్యాన్ని ఎత్తిచూపుతూ, అభిమానం పేరుతో సెలబ్రిటీలను ఇబ్బంది పెట్టడం సరికాదని అభిప్రాయపడ్డారు. ప్రభాస్ హీరోగా మారుతి డైరెక్ట్ చేస్తున్న సినిమా 'ది రాజాసాబ్'. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్ లో రూపొందుతున్న ఈ చిత్రంలో మాళవిక మోహనన్, నిధి అగర్వాల్ , రిద్ధి కుమార్ వంటి ముగ్గురు హీరోయిన్లు నటిస్తున్నారు. ఇప్పటికే పలుమార్లు రిలీజ్ డేట్లు మార్చుకున్న ఈ పాన్ ఇండియా మూవీని సంక్రాంతికి విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ప్రమోషన్స్ లో భాగంగా బుధవారం నిర్వహించిన ఈవెంట్ లో నిధికి చేదు అనుభవం ఎదురైంది.'ది రాజాసాబ్' నుంచి 'సహన సహన' అనే సెకండ్ సాంగ్ ను లాంచ్ చేసిన సంగతి తెలిసిందే. దీని కోసం హైదరాబాద్ కూకట్ పల్లి హౌసింగ్ బోర్డులోని లులు మాల్‌లో ఈవెంట్ నిర్వహించారు. హీరోయిన్లు నిధి అగర్వాల్, రిద్ధి కుమార్ లతో పాటుగా దర్శకుడు మారుతి, నిర్మాత టీజీ విశ్వప్రసాద్, స్ కే న్ హాజరయ్యారు. దీనికి పెద్ద సంఖ్యలో అభిమానులు హాజరయ్యారు. అత్యుత్సాహం ప్రదర్శిస్తూ చిత్ర బృందాన్ని ఇబ్బంది పెట్టారు. హీరోయిన్లు కూర్చున్న సోఫాల మీదకు దూసుకొచ్చారు. ఈవెంట్ అయిపోయిన తర్వాత నిధి అగర్వాల్ కారు వద్దకు వస్తున్న సమయంలో అభిమానులు ఆమెను చాలా ఇబ్బందికి గురి చేశారు. పెద్ద ఎత్తున ఆమెను చుట్టు ముట్టారు. ఒడియమ్మా బంటీ అంటూ అత్యుత్సాహంతో ఆమెపై పడిపోయారు. కొంతమంది ఆమెను తాకే ప్రయత్నం చేశారు. సెక్యూరిటీ కూడా ఫ్యాన్స్ ని కంట్రోల్ చేయలేకపోయారు. చివరకు ఎలాగోలా కారు ఎక్కిన నిధి.. ఇదంతా ఏంటి అంటూ చిరాకు పడ్డారు. ముఖానికి చేతులు అడ్డుపెట్టుకుంటూ అసహనం వ్యక్తం చేశారు.రాజాసాబ్ ఈవెంట్ లో నిధి అగర్వాల్ ని అభిమానులు ఇబ్బంది పెట్టిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఆమె ఎంతగా ఇబ్బంది పడ్డారనేది ఇందులో క్లియర్ గా కనిపిస్తోంది. దీనిపై నెటిజన్లు పలు రకాలుగా కామెంట్స్ చేస్తున్నారు. నిర్వాహకులు సరైన జాగ్రత్తలు తీసుకోలేదని అంటున్నారు. అభిమానం పేరుతో సెలబ్రిటీలను ఇబ్బందులకు గురి చేయకూడదని, అందులోనూ ఒక హీరోయిన్ మీద పడిపోవడం సరికాదని అంటున్నారు.నిధి అగర్వాల్ వీడియోపై సింగర్ చిన్మయి శ్రీపాద సోషల్ మీడియా వేదికగా స్పందించారు. జంతువుల కంటే దారుణంగా ప్రవర్తిస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. "నక్కల కంటే దారుణంగా ప్రవర్తించే మగాళ్ల గుంపు ఇది. నక్కలను ఎందుకు అవమానించాలి? ఒకే రకమైన మనస్తత్వం ఉన్న మగాళ్లను గుంపుగా చేర్చితే, వారు ఒక మహిళను ఇలాగే వేధిస్తారు. దేవుడు వీళ్లందరినీ తీసుకెళ్లి వేరే గ్రహం మీద ఎందుకు పడేయడు?" అని ఎక్స్ లో పోస్ట్ పెట్టారు.

# 'రెడ్డి కాదు చౌదరి అని పెట్టుకో..




మంచు మనోజ్ హీరోగా నటిస్తున్న లేటెస్ట్ మూవీ 'డేవిడ్ రెడ్డి'. బ్రిటీష్ కాలం నాటి కథతో రూపొందుతున్న ఈ పాన్ ఇండియా మూవీ టీజర్ ను చిత్ర బృందం బుధవారం ఆవిష్కరించింది. అయితే సినిమా టైటిల్‌పై ఓ వర్గం నెటిజన్ల నుంచి అభ్యంతరాలు వ్యక్తం అవుతున్నాయి. రెడ్డి కాదు చౌదరి అని పెట్టుకో.. 100 రోజులు ఆడుతుందని ఓ నెటిజన్ ట్వీట్ పెట్టిన ట్వీట్ పై మనోజ్ కౌంటర్ ఇచ్చారు. సినిమా టైటిల్స్ క్యాచీగా ఉండాలని, త్వరగా జనాల్లోకి వెళ్లాలని ఫిలిం మేకర్స్ కోరుకుంటారు. అందుకే ఎన్నో ఆలోచించి టైటిల్స్ ఖరారు పెడుతుంటారు. అయితే కొన్ని సామాజిక వర్గాలకి చెందిన పేర్లను సినిమా టైటిల్స్ గా పెట్టడం.. నెగెటివ్ షేడ్స్ ఉన్న విలన్ పాత్రలకు కాస్ట్ ట్యాగ్ తగిలించడం వంటి వాటిపై అప్పుడప్పుడు అభ్యంతరాలు వ్యక్తం అవుతుంటాయి. నిజంగా కథ డిమాండ్ మేరకు అలాంటి టైటిల్స్ పెట్టేవారు కొందరైతే, అవసరం లేకున్నా క్రేజ్ కోసం పెట్టేవారు మరికొందరు ఉన్నారు. గతంలో సినిమా టైటిల్స్ విషయంలో అనేక వివాదాలు వచ్చాయి. ఇప్పుడు 'డేవిడ్ రెడ్డి' కారణంగా మరోసారి ఈ అంశంపై చర్చలు జరుగుతున్నాయి.రాకింగ్ స్టార్ మంచు మనోజ్ చాలా ఏళ్ల తర్వాత హీరోగా నటిస్తున్న సినిమా 'డేవిడ్ రెడ్డి'. హనుమ రెడ్డి యక్కంటి దర్శకత్వంలో ఈ చిత్రం తెరకెక్కుతోంది. వెంకట్ రెడ్డి, భరత్ మోటుకూరి దీనికి నిర్మాతలు. బ్రిటీష్ ఇండియా కాలం నాటి బ్యాక్ డ్రాప్ లో ఇంటెన్స్ యాక్షన్ డ్రామా స్టోరీతో భారీ స్థాయిలో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. గురువారం లాంచ్ చేసిన ఈ మూవీ టీజర్ కు అనూహ్య స్పందన లభిస్తోంది. ఇదంతా బాగానే ఉంది కానీ.. 'డేవిడ్ రెడ్డి' అనే టైటిల్ పై కొందరు నెటిజన్లు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. 'డేవిడ్ రెడ్డి' టైటిల్ పై ఓ నెటిజన్ ట్వీట్ చేస్తూ.. "ఇంకెన్నాళ్లు బ్రో రెడ్డి ట్యాగ్స్. డేవిడ్ చౌ అని పెట్టుకో.. 200 సెంటర్స్ లో 100 డేస్ ఆడుతుంది" అని అన్నాడు. ఇక్కడ చౌ అంటే చౌదరి అనే ఉద్దేశంలో పెట్టాడనే సంగతి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. దీనిపై హీరో మంచు మనోజ్ రియాక్ట్ అయ్యారు. "నేను ట్రై చేశాను బ్రో.. కానీ వాళ్లు నా మాట వినలేదు" అని పేర్కొన్నారు. దీనికి ఒక స్మైలీ ఎమోజీని జత చేశారు. ఇక్కడ మనోజ్ దర్శక నిర్మాతలు తన మాట వినలేదని అన్నారో, లేదా పేరు తర్వాత ఆ ట్యాగ్ పెట్టుకోడానికి సామాజిక వర్గం వాళ్లు ఒప్పుకోలేదనే అర్థంలో చెప్పారో తెలియదు కానీ.. ఈ పోస్ట్ ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతోంది. ఇకపోతే 1897 నుంచి 1922 మధ్య కాలంలో జరిగే కథతో 'డేవిడ్ రెడ్డి' సినిమా తెరకెక్కుతోంది. ఇందులో డేవిడ్ రెడ్డి బ్రిటీష్ వారికే కాదు ఇండియన్స్ కూడా శత్రువే అని, అతనికి పీస్ ఫుల్ గా ఉండటం రాదని, ఏదైనా వెళ్లి కొట్టి తెచ్చుకోవడమే తెలుసని మంచు మనోజ్ చెప్పారు. ఇండియాకు స్వాతంత్ర్యం అడిగి కాదు, కొట్టి తెచ్చుకోవాలి అనేది డేవిడ్ రెడ్డి దృక్పథం అని.. బ్రిటీష్ వాళ్లు ఊళ్లకు ఊళ్లు తగలబెడుతుంటే ఆ హింసను హింసతోనే సమాధానం చెప్పే యోధుడిగా డేవిడ్ రెడ్డి కనిపిస్తాడని తెలిపారు. డేవిడ్ రెడ్డి బైక్ పేరు వార్ డాగ్ అని, అతని చేతులో ఉన్న స్టిక్ పేరు డెత్ నోట్ అని, ఇవి రెండు డేవిడ్ రెడ్డి ఆయుధాలని చెప్పారు. ఇదొక పవర్ ఫుల్ క్యారక్టర్ అని, తనను ఎలాంటి సినిమాలో చూపిస్తే బాగుంటుందో అలాంటి చిత్రమే ఇదని మనోజ్ పేర్కొన్నారు.

# 'వారణాసి' సెట్‌కి రావాలని ఉంది..




ప్రపంచవ్యాప్తంగా భారీ అంచనాల మధ్య విడుదలకు సిద్ధమవుతున్న జేమ్స్ కామెరూన్ చిత్రం 'అవతార్: ఫైర్ అండ్ యాష్' బిగ్ స్క్రీన్ అనుభూతికి కొత్త ప్రమాణాలు నెలకొల్పనుందని రాజమౌళి ప్రశంసించారు. ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా జేమ్స్ కామెరూన్‌ఉఎస్.ఎస్. రాజమౌళి మధ్య జరిగిన స్పెషల్ ఇంటర్వ్యూ ప్రస్తుతం వైరల్ అవుతోంది. ఈ సందర్భంగా రాజమౌళి సినిమాటిక్ ఆలోచన విధానాన్ని కామెరూన్ మెచ్చుకుంటూ, అవకాశం వస్తే ఆయనతో కలిసి పని చేయాలనుందని తెలిపారు. హాలీవుడ్ దిగ్గజ దర్శకుడు జేమ్స్ కామెరూన్ రూపొందించిన ప్రతిష్టాత్మక చిత్రం 'అవతార్: ఫైర్ అండ్ యాష్' ప్రపంచవ్యాప్తంగా బిగ్ స్క్రీన్ ఎక్స్‌పీరియన్స్‌కు కొత్త ప్రమాణాలు నెలకొల్పనుందని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు. ఇప్పటికే 'అవతార్' తొలి రెండు భాగాలు విజువల్స్, టెక్నాలజీ, వరల్డ్ బిల్డింగ్ పరంగా చరిత్ర సృష్టించగా, మూడో భాగం మరింత విస్తృతమైన లోకాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతుందని కామెరూన్ వెల్లడించారు. పండోరా గ్రహంలో కొత్త తెగలు, కొత్త సంస్కృతి, నిప్పుఉబూడిద నేపథ్యంతో సాగే సంఘర్షణ ఈ భాగానికి ప్రధాన ఆకర్షణగా నిలవనుంది. 'అవతార్ 3' ప్రమోషన్స్‌లో భాగంగా తాజాగా జేమ్స్ కామెరూన్, భారతీయ సినీ దిగ్గజ దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళి కలిసి ఒక స్పెషల్ ఇంటర్వ్యూలో పాల్గొన్నారు. దీనికి సంబంధించిన వీడియోను చిత్ర బృందం యూట్యూబ్‌లో విడుదల చేయగా, క్షణాల్లోనే అది వైరల్‌గా మారింది. గతంలో 'ర్ ర్ ర్ ' విడుదల సమయంలో వీరిద్దరూ కలిసిన ఫోటోలు ఎంతగా హల్‌చల్ చేశాయో తెలిసిందే. ఇప్పుడు అధికారికంగా ఒక ఇంటర్వ్యూలో వీరి మధ్య జరిగిన సంభాషణ ప్రపంచవ్యాప్తంగా సినీ అభిమానుల్లో ఉత్సాహాన్ని నింపుతోంది. ఈ ఇంటర్వ్యూలో రాజమౌళి, 'అవతార్ 3' గురించి జేమ్స్ కామెరూన్‌కి ఆసక్తికరమైన ప్రశ్నలు సంధించారు. ముఖ్యంగా పండోరా గ్రహంపై ఈసారి కనిపించబోయే కొత్త ప్రపంచం గురించి అడగగా, కామెరూన్ ఎంతో ఉత్సాహంగా వివరించారు. ఈ మూడో భాగంలో నిప్పు, బూడిద నేపథ్యంతో ఉండే కొత్త తెగలు, వారి జీవన విధానం, విజువల్ గ్రాండియర్‌ను ఎలా డిజైన్ చేశారన్న అంశాలను ఆయన రాజమౌళికి వివరించారు. ప్రతి ఫ్రేమ్ ప్రేక్షకులను మరో లోకంలోకి తీసుకెళ్లేలా రూపొందించామన్నారు. ఇంటర్వ్యూలో చర్చ కేవలం 'అవతార్' వరకే పరిమితం కాలేదు. రాజమౌళి భవిష్యత్తు ప్రాజెక్టులపై కూడా కామెరూన్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ముఖ్యంగా రాజమౌళి ప్రతిష్టాత్మకంగా తెరకెక్కించనున్న 'వారణాసి' ప్రాజెక్ట్ గురించి తనకు తెలుసని, ఆ సినిమా కోసం ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నట్లు జేమ్స్ కామెరూన్ వెల్లడించారు. ఆ సినిమా షూటింగ్ జరుగుతున్న సమయంలో తాను స్వయంగా సెట్‌కు వచ్చి చూడాలనుకుంటున్నానని చెప్పారు. అంతేకాదు, అవకాశం వస్తే రాజమౌళితో కలిసి పని చేయాలన్న తన కోరికను కూడా ఆయన బయటపెట్టారు. అవసరమైతే కెమెరా పట్టుకుని కొన్ని షాట్లు తానే తీసి పెడతానని సరదాగా వ్యాఖ్యానించారు.

Owned by Katikala Vara Prasad,Printed at Sunday printing press 3_4297 Saraswati complex SVN colony. guntur.ap 522006. Published by Banka Indira . at D.no. 465 Le out no2. Dodleru Road. Ysr jagananna colony. Krosuru.Guntur AP. 522410. Editor. Katikala Vara Prasad.RNI APTEL/2015/62250. Ph:9849707349 email:kvp6858@gmail.com